
సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం ၊ 10 ၊ ఏప్రిల్ ၊ 2024





ఆయిల్‌పాంకు డిమాండ్
సంప్రదాయ పంటలకు బదులుగా రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /21.8

వాతావరణం
ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

తగ్గిన ఉష్ణోగ్రతలు

అచ్చంపేట: జిల్లాలో ఎండలు **కొంతమేర** తగ్గాయి. మంగళవారం పెంట్లవె**ల్లి మండలం** జటప్రోల్‌లో అత్యధికంగా **40.5 డిగ్రీల** ఉష్ణోగ్రత నమోదు కాగా.. **అత్యల్పంగా** పదరలో 36.7 డిగ్రీలుగా నమో**దైంది. అదేవి**ధంగా కొల్లాపూర్, పెద్దకొత్తప**ల్లి మండలం** చెన్నపురావుపల్లిలో 40.3, **కోడేరు**, బిజినేపల్లిలో 40.2, మిగతా ప్రాంతాల్లో 39.9 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్ని రోజులుగా 40 నుంచి 43.5 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఎండలు తగ్గడంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించింది.

‘22 వరకు దరఖాస్తు చేసుకోవాలి’

మహబూబ్‌నగర్ న్యూటౌన్: తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూపీఎస్సీ సీసాట్–2025 పరీక్ష కోసం 2024–25 విద్యా సంవత్సరంలో 100 మంది మైనారిటీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు ఈ నెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎంకె.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ల నియమం ప్రకారం 33.33 శాతం మహిళా అభ్యర్థులకు, అన్ని కేటగిరీల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ఆధారంగానే కల్పిస్తామని వివరించారు.సీసాట్–2025 యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న ప్రవేశపరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 040–23236112 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీఎల్‌ఎఫ్ ఎంపీ అభ్యర్థిగా బాలస్వామి



మన్ననూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) అభ్యర్థిని ఖరారు చేసింది. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లికి చెందిన ప్రజాకవి, గాయకుడు పంబలి బాలస్వామిని బీఎల్‌ఎఫ్ తరఫున ఎంపీ అభ్యర్థిగా రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ ప్రకటించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎలిమిలేటి శ్రీశైలం సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిజం, బహుజనవాదం, కారల్ మార్క్స్, అంబేడ్కర్ సిద్ధాంతాలతో బీఎల్‌ఎఫ్ మరింత బలోపేతం అవుతుందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, కవులు, కళాకారులు, రైతులు, అన్ని సంఘాలు ఏకమై బహుజన వాదాన్ని గెలిపించుకోవాలని కోరారు.


● ‘మైలారం’పై మైనింగ్ పడగ

ఆ వెనుక ఎవరు..?

తమ జీవితాలను నాశనం చేసే మైనింగ్ వద్దంటే వద్దు మొర్రో అని ఆ పల్లెవాసులు మొత్తుకుంటున్నారు. ఈ మేరకు వారు చేయని ప్రయత్నం లేదు. అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వద్దకు నిత్యం చక్కర్లు కొడుతూనే ఉన్నారు. అయినా కాంట్రాక్టర్లు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ‘అధికార’ యంత్రాంగం సైతం ప్రజాప్రయోజనాలను విస్మరించి ‘అనుమతులు పొందారు కదా’ అని వారికే మద్దతు పలుకుతుండడం ఆ గ్రామస్తులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

..నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని మైలారం గుట్టపై మైనింగ్ మాఫియా ఆరేళ్ల క్రితమే కన్నేసింది. గ్రామస్తుల సమష్టి పోరాటంతో అడ్డుకోగా.. కాంట్రాక్టర్లు ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్నారు. తాజాగా వారు మళ్లీ తవ్వకాలకు సిద్ధమవడంతో ఈ తతంగం వెనుక ఎవరు కీలకంగా వ్యవహరిస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



ఓ మంత్రి ఒత్తిడి.. స్థానిక నేత దూకుడు

మారిన రాజకీయ పరిణామాల క్రమంలో నియోజకవర్గ ముఖ్య నేత ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా అన్నీ తానై ఈ మైనింగ్ వ్యవహారాన్ని దూకుడుగా ముందుకు తీసుకెళ్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి పాలమూరుకు సమీపంలోని జిల్లాకు చెందిన ఓ మంత్రి కాంట్రాక్టర్లకు మద్దతుగా సదరు నేతపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆ ముఖ్య నేత స్వయంగా పలువురు గ్రామస్తులతో సైతం వెల్లడించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన అచ్చంపేట పరిధిలో గ్రామస్తుల అభీష్టానికి వ్యతిరేకంగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు హాట్‌టాపిక్‌గా మారాయి.

ప్రజాప్రయోజనాలను విస్మరించి కాంట్రాక్టర్లకే మద్దతు

- పాలమూరు సమీప జిల్లాలోని ఓ అమాత్యుడి ఒత్తిళ్లు
- నియోజకవర్గంలోని కీలకనేత పావులు
- ‘అధికార’ యంత్రాంగంపై విమర్శల వెల్లువ

ఆ 5 గ్రామాలకు ఆదెరువు.. అయినా..

మైలారం గ్రామం మొత్తం ఆ గుట్టను అనుసరించే ఉంది. ఈ ఊరిలో 300 వరకు కుటుంబాలు ఉండగా.. జనాభా 1,500 వరకు ఉంటుంది. గుట్టపైనే 50కి పైగా గృహాలతో పాటు నర్సింహస్వామి, వెంకటేశ్వరస్వామి, శివాలయం, మారెమ్మ, పోచమ్మ, ఈదమ్మ ఆలయాలు ఉన్నాయి. గుట్టపై నెమలితో పాటు అడవి పందులు ఇతర వన్యమృగాలు సంచరిస్తూ ఉంటాయి. బల్మూర్, మైలారం, కొండనాగుల, వీరంరాజ్‌పల్లి, రామాజిపల్లి గ్రామాల ప్రజలకు గుట్ట ఆదెరువుగా ఉంది. పశువులు, జీవాల మేతతో పాటు వంట చెరుకుకు ఈ గుట్టే ఆధారంగా ఈ ఐదు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారు. అయితే ఈ గుట్టపై సర్వేనంబర్ 120/1లో క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పర్ ఖనిజ తవ్వకాలకు మైనింగ్‌శాఖ 2017లో అనుమతి ఇచ్చింది. మైనింగ్ జరిగే ప్రాంతంలో సుమారు 50 ఇళ్లు, దీంతో పాటు 150 మీటర్ల దూరంలోనే నివాసాలు ఉండడం.. జీవ వైవిధ్యంతో పాటు . సమీపంలోని చెరువుల్లో చేపలు చనిపోయే ప్రమాదం ఉండడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



మైలారం గుట్టపై, గుట్టకు సమీపంలో ఉన్న నివాసాలు

అనుమతులపై పునఃసమీక్షించుకోవాలి..



పూర్వ కాలం నుంచి గ్రామానికి గుట్ట రక్షణగా ఉంది. గుట్టపైనే పురాతన శివాలయంతో పాటు నర్సింహస్వామి తదితర ఆలయాలు ఉన్నాయి. పక్కనే ముస్లింల సమాధులు ఉన్నాయి. పల్లె ప్రకృతి వనంతో పాటు క్రీడా ప్రాంగణం, ఇంకోవైపు డంప్‌యార్డు గుట్టపైనే ఉంది. ఈ గుట్టపై ఆధారపడి సుమారు ఐదు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడ తవ్వకాలు జరిపితే ప్రజల బతుకులు దుర్భరంగా మారుతాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపి అనుమతులపై పునఃసమీక్షించుకోవాలి. లేకుంటే న్యాయపోరాటంతో పాటు దేనికైనా సిద్ధమే.

– ఎలికంటి లింగయ్య, శివాలయం చైర్మన్

ఏకతాటిపై ఉన్నాం..



మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదు. ఇప్పటికే కలెక్టర్‌తో పాటు మైనింగ్ అధికారులను కలిశాం. ప్రజల బతుకులను ఆగం చేసే మైనింగ్ తవ్వకాలను అడ్డుకోవాల్సిన వారే.. కాంట్రాక్టర్లకు మద్దతుగా నిలవడం శోచనీయం. దీనిపై గ్రామస్తులందరం ఏకతాటిపై ఉన్నాం. తవ్వకాలను ఆపేందుకు ఎంత దూరమైనా వెళ్తాం.

– ఈర్లదిన్నె శ్రీశైలం, మైలారం

గత ఏడాది వెలుగులోకి.. అడ్డుకున్న అప్పటి ఎమ్మెల్యే

మైలారం గుట్టపై తవ్వకాలకు కాంట్రాక్టర్లు 2017లో అనుమతులు పొందిన తర్వాత స్తబ్దుగా ఉన్నారు. తవ్వకాల క్రమంలో గత ఏడాది సర్వే చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్టీఐ ద్వారా గ్రామసభ తీర్మానం కాపీ వెలుగు చూడగా.. పలువురి సంతకాలు ఫోర్జరీ చేసినట్లు.. 2041 అక్టోబర్ పదో తేదీ వరకు తవ్వకాలు చేసుకునేందుకు మైనింగ్ శాఖ అనుమతులు ఇచ్చినట్లు తేలడంతో గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు అప్పటి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజును స్థానికులు కలిసి విన్నవించారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఎవరూ ముందుకెళ్లొద్దని ఆయన సూచించడంతో కాంట్రాక్టర్లతో పాటు అధికారులు వెనక్కి తగ్గారు.



గుట్టపై, గుట్టకు ఆనుకొని ఉన్న ఆలయాలు

కొల్లాపూర్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: శ్రీక్రోధినామ సంవత్సరంలో కొల్లాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడిపించేందుకు కృషిచేస్తానని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రామాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో మంత్రి పాల్గొనగా.. అర్చకుడు రాఘవేంద్రాచార్యులు పంచాంగాన్ని పఠించారు. కొత్త ఏడాదిలో కొల్లాపూర్ ప్రజలకు మేలు జరిగే పనులు వేగంగా సాగుతాయన్నారు. జాతక ఫలాలు, రాశుల వారీగా పంచాంగం చదివి వినిపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శ్రీక్రోధినామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

పెంట్లవెల్లి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జామియా మసీదులో మంత్రి జూపల్లి కృష్ణారావు ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మసీదులో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో షావుశాన్, ఖాజామైనుద్దీన్, గౌస్, కబీర్, యాసిప్, గోపాల్, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, గోవిందుగౌడ్, వంగ భాస్కర్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం

బిజినేపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమని ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. తిమ్మాజీపేట మండలంలోని హనుమాన్‌తండా, ఇప్పలపల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కందనూలు పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం తథ్యమన్నారు. కార్యకర్తలు మరింత కష్టపడి పనిచేసి.. మంచి మెజార్టీ వచ్చేలా కృషిచేయాలని కోరారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈసందర్భంగా పలు పార్టీల కార్యకర్తలు మల్లురవి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో శ్రీనివాస్ బహదూర్, దానం బాలరాజ్, వెంకటరామిరెడ్డి, మాధవులు, ఉస్మాన్, లక్ష్మీనారాయణ, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇప్పలపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మల్లురవి

కవిత్వం.. ప్రజల్లో చైతన్యం నింపాలి



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

నాగర్‌కర్నూల్: ప్రజల్లో చైతన్యం నింపేలా కవిత్వం రావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆనంద్‌జీ అన్నారు. క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో స్థానిక సింగిల్‌విండో సమావేశ మందిరంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ప్రచారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రజాసంస్థలను అమ్ముకోవడం ఏ నీతికి తార్కాణమని ప్రశ్నించారు. అవినీతి లేని ప్రభుత్వాలను ఎన్నుకోవాలని.. ఆ దిశగా కవుల కవిత్వం ఉండాలని కోరారు. విశిష్ట అతిథి సీఎస్‌ఆర్ విద్యాసంస్థల అధినేత చింతలపల్లి భాస్కర్‌రావు మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎదిగినట్లుగానే, ఆహార పంటలలో దేశం అభివృద్ధి చెందాలని కాంక్షించారు. ఆహారంలో సిరిధాన్యాలు భాగం కావాలన్నారు. ప్లాస్టిక్ భూతం ప్రజలను పట్టిపీడిస్తోందని.. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కవులు తమ కవిత్వాలకు పదునుపెట్టాలని కోరారు. కవి, గాయకుడు కల్వకోల్ మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించిన కవి సమ్మేళనంలో 40 మందికి పైగా కవులు పాల్గొని కవితా గానం చేశారు. కార్యక్రమంలో నెలపొడుపు సంస్థ అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, గౌరవాధ్యక్షుడు కందికొండ మోహన్, గడ్డంపల్లి భూపాల్‌రెడ్డి, వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ముచ్చర్ల దినకర్, గన్నోజు గోపాలాచారి, గుడిపల్లి నిరంజన్ ఇద్రీస్, గబ్బి శేఖర్, దేవరపాక కృష్ణయ్య, ఆర్కల రాజేష్, గుడిపల్లి రవి, వాకిటి అశోక్, బోనాసి తిరుపతయ్య హరి శంకర్ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్పీకి బిగ్ షాక్!

- కాంగ్రెస్‌లో చేరనున్న ఆయన తమ్ముడు ప్రసన్నకుమార్?
- ఇప్పటికే సీఎం రేవంత్, ఏఐసీసీ కార్యదర్శితో చర్చలు

అలంపూర్: బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఆయన సోదరుడు షాకివ్వనున్నాడు. బీఎస్పీలో కలిసి పనిచేసిన అన్నదమ్ములు అసెంబ్లీ ఎన్నికల తర్వాత తలో దిక్కుకు వెళ్తున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీచేసిన ఆర్‌ఎస్ ప్రసన్న కుమార్ త్వరలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు జోరు ప్రచారం సాగుతోంది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఇటీవల బీఎస్పీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా ప్రవీణ్‌కుమార్‌ను బరిలో దింపారు. మాట మాత్రమైన చెప్పకుండా ప్రవీణ్ కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరడంతో అన్నదమ్ముల మధ్య దూరం పెరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రసన్నకుమార్ తన రాజకీయ భవిష్యత్ దృష్ట్యా కాంగ్రెస్‌లో చేరడానికి సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో సమావేశమైనట్లు తెలుస్తోంది. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో సైతం సమావేశమైనట్లు సమాచారం. రాజకీయ భవిష్యత్‌కు రేవంత్‌రెడ్డి నుంచి భరోసా రావడంతో త్వరలోనే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోడానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ప్రసన్నకుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం దాదాపు ఖాయమని స్థానిక కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు. ఇదే జరిగితే మరో మూడు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొనే అవకాశం ఉంది. అలంపూర్ నియోజకవర్గం నుంచి 2009లో ప్రసన్న కుమార్ టీడీపీ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అన్న ప్రవీణ్ కుమార్ బీఎస్పీ పార్టీలో రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉండటంతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా అలంపూర్ నుంచే బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత స్తబ్దుగా ఉన్న ప్రసన్నకుమార్ ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే ప్రచారం జరగడంతో స్థానికంగా చర్చకు దారితీసింది.



ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను కలిసిన ప్రసన్నకుమార్

నేడు జిల్లాస్థాయి ‘ప్రేరణ ఉత్సవ్’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాస్థాయి ‘ప్రేరణ ఉత్సవ్’ను ఈనెల 10న ఎనుగొండలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి వై.సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు జరిగిన పోటీలలో ప్రతి కేవీ, నవోదయ, సీబీఎస్‌ఈ, స్టేట్ బోర్డు పాఠశాల నుంచి బాలుర, బాలిక ఒక్కొక్కరు చొప్పున ఎంపిక చేశామన్నారు. ఇలా 45 పాఠశాలల నుంచి 90 మంది విద్యార్థులు, 45 మంది గైడ్ టీచర్లు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరికి ముఖ్యంగా ‘ప్రేరణ కార్యక్రమానికి నన్ను ఎందుకు ఎంపిక చేయాలి?, వికసిత భారత్, దేశంపై నా వైఖరి’ అంశాలలో ఏదో ఒక దానిపై వ్యాసరచన, కవిత లేదా పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. చివరగా జిల్లా నుంచి బాలుర, బాలిక ఒక్కొక్కరు చొప్పున గుజరాత్‌లో జరిగే ‘ప్రేరణ’కు అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. వీరికి గైడ్ టీచర్‌గా ఓ ఉపాధ్యాయురాలిని ఎంపిక చేస్తామన్నారు.

కొత్త కాంతుల ‘శ్రీక్రోధి’

- జిల్లావ్యాప్తంగా ఉగాది సందడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పంచాంగ శ్రవణం చేసిన వేదపండితులు
- ఉమామహేశ్వరంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్ పూజలు

అచ్చంపేట/నాగర్‌కర్నూల్ క్రైం /కల్వకుర్తిరూరల్: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. శోభకృత్‌నామ సంవత్సరం తీపి, చేదు అనుభవనాలను మరిచి.. శ్రీక్రోధినామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి, నివాసగృహాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరంలో అంతా శుభం కలగాలని ప్రార్థించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పలు ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. జిల్లా భవిష్యత్‌ను వివరించడంతో పాటు ప్రజల రాశీ ఫలాలు, జాతక చక్రాలు, గ్రహ స్థితులను తెలియజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు తమ జాతకాలను చూసుకున్నారు.



జిల్లా కేంద్రంలోని రామాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకుడు వరదరాజన్ అయ్యంగార్

సిరిసంపదలు కలగాలని..

గ్రామాల్లో రైతులు వేకువజామునే పొలాలకు వెళ్లి వ్యవసాయ పరికరాలు, కాడెద్దులకు పూజలు చేశారు. అనంతరం నాగలిని తోలి, వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఇలా చేయడం వల్ల పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని రైతుల విశ్వాసం. కులవృత్తిదారులు తమ పరికరాలు ప్రత్యేక పూజలు చేశారు. ఉగాదికి ప్రతీకగా నిలిచే షడ్రుచుల పచ్చడి సేవించారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు..

జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఉమామహేశ్వరుడిని దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. శ్రీశైలం వెళ్లి వచ్చే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



ఉమామహేశ్వరుడికి పూజలు చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్



గుండూరులో పంచాంగం వింటున్న ఎంపీ రాములు

■ కల్వకుర్తి మండలంలోని గుండూరు సీతారామాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఎంపీ రాములు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కాంక్షించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

నీటిగుండంలో పడి వ్యక్తి మృతి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయ సమీపంలోని నీటి గుండంలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ హృషికేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మండ్ల రాముడు(50) సోమవారం దేవాలయ సమీపంలోని నీటిగుండంలో పడి మృతిచెందాడు. ఈ మృతిపై అనుమానం ఉన్నట్లు మృతుని భార్య అలివేలమ్మ తెలిపారు. మృతుడి అన్న కుమారుడు కురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

డీసీఎం, బైక్ ఢీ: యువకుడి దుర్మరణం


బాలు (ఫైల్)

ధన్వాడ: మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ధన్వాడకు చెందిన సపాయి బాలు, గణేష్, తిరుమల్లేష్ బీసీకాలనీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం మలుపు వద్ద బైక్‌పై వస్తుండగా నారాయణపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న సపాయి బాలు(25), గణేష్‌కు తీవ్ర గాయలుకావడంతో 108 వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలు మృతిచెందాడు. డీసీఎం ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు హైదరాబాద్ వైపు ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో రాయికల్ టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. బాలు తండ్రి చంద్రప్ప గ్రామపంచాయతీలో కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడటంతో కుటుంబీకులు శోక సముద్రంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

గట్టు: ఉగాది పండుగ కోసం అత్తారింటికి వెళ్తున్న అల్లుడు మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గట్టు మండల సల్కాపురం గ్రామానికి చెందిన ఊరబావి ఆంజనేయులు (24) కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా మదిరికకు చెందిన అక్క కూతురు నాగమ్మను రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి రెండేళ్ల కూతురు ఉంది. సల్కాపురం నుంచి పండుగ కోసం అత్తారింటికి బయలు దేరాడు. కర్ణాటకలోని శాపూర్ క్రాస్ రోడ్డు దగ్గర బస్సు దిగి రోడ్డు దాడుతున్న క్రమంలో గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో కుటుంబంలో విషాదం నెలకొంది.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని పోలిశెట్టిపల్లి శివారులోని అచ్చంపేట– నాగర్‌కర్నూల్ రోడ్డుపై జేఎంజే పాఠశాల వద్ద ఈ నెల 7న రాత్రి 11 గంటలకు ఆటోను లారీ ఢీకొట్టిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలియజేశారు. అచ్చంపేట మండలం లింగోటానికి చెందిన నగేష్ గౌడ్ తన ఆటో టీఎస్ 31టీ 2944లో నాగర్‌కర్నూల్ నుంచి ఫర్టిలైజర్ కాటన్లు తీసుకొస్తున్నాడు. అచ్చంపేట వైపు నుంచి వచ్చిన టీఎస్ 08 యూబీ 8080 నంబర్ సిమెంట్ లోడ్ లారీ, ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ఫర్టిలైజర్ కాటన్లతో పాటు ఆటో దెబ్బతిని, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు ఆటో డ్రైవర్ భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలియజేశారు.

కలుషిత ఆహారం తిని ఆస్పత్రి పాలు

మక్తల్: కలుషిత ఆహారం తిని ఓ కుటుంబం అస్వస్థతకు గురైన ఘటన ఊట్కూర్ మండలం పెద్దపొర్లలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నడిపి శివప్ప కుటుంబ సభ్యులు మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నడిపి శివప్ప, శ్యామలమ్మ, రజిత, సునీల్, ఆనంద్, చంద్రశేఖర్, రామలింగం, అక్షిత, సుజాత చికిత్స పొందుతున్నారు.

ఇంట్లో బంగారు, నగదు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో బంగారు, నగదు చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన పోలిశెట్టి చంద్రయ్య ఈనెల 6న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని తన కొడుకు వద్దకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి బీరువాలో ఉన్న రూ.50వేల నగదు, తులంన్నర బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇంటి పని మనిషి మంగళవారం ఇంటి వద్దకు రాగా, ఇంటి తలుపు తెరిచి ఉండటంతో గమనించి పోలిశెట్టి చంద్రయ్యకు సమాచారం అందించింది. దీంతో బాధితుడు అక్కడికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీం ఘటనాస్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆయిల్‌పాంకు డిమాండ్


కష్లాపూర్‌లో సాగవుతున్న ఆయిల్‌పాం తోట

- వందల నుంచి వేల ఎకరాలకు సాగు విస్తరణ
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా డ్రిప్ సౌకర్యం
- ఆసక్తి చూపుతున్న రైతులు

గండేడ్: సాంప్రదాయ పంటల సాగుతో విసిగిపోయిన రైతులు వాణిజ్య పంటలసాగుపై దృష్టి సారిస్తున్నారు. కూలీల కొరత, తగ్గుతున్న భూగర్భ జలాలు, ఎరువుల వినియోగం తదితర అన్ని కలిసి పెట్టుబడి తడిసి మోపెడు అవుతున్నది. ఈ తరుణంలో ఆయిల్‌పాం సాగు తెరమీదకి వచ్చింది. ఒకప్పుడు పెద్ద రైతులు మాత్రమే సాగు చేసేవారు. ప్రస్తుతం ఈ సాగు గ్రామాలకు విస్తరించింది.

పైలెట్ ప్రాజెక్టుగా 232 ఎకరాల్లో..

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఆయిల్‌పాం సాగుకు శ్రీకారం చుట్టారు. మొదటగా గండేడ్, నవాబుపేట్, రాజాపూర్, మహబూబ్‌నగర్ మండలాల్లోని గ్రామాల్లో సాగు చేయాలని హార్టికల్చర్ అధికారులు సంకల్పించారు. ఇందులో భాగంగా 2019–20లో 38 మంది రైతులు 232 ఎకరాల్లో సాగు చేశారు. 2022–23లో ఆయా మండలాల్లో 488 మంది రైతులు 2,104 ఎకరాల్లో సాగు చేశారు. 2023–24లో ఈ నెల వరకు 432 మంది రైతులు 1,419 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 958 మంది రైతులు 3,755 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గండేడ్, మహమ్మదాబాద్ ఉమ్మడి మండల వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో 5 ఎకరాల్లో ఒక్క రైతుతో ప్రారంభం కాగా, ప్రస్తుతం 65 మంది రైతులు 238.96 ఎకరాల్లో తోటలు సాగు చేస్తున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో ఈ తోటలు సాగవుతున్నాయి. వీటిలో ఉమ్మడి మండలంలోని అన్నారెడ్డిపల్లి, వెన్నాచేడ్, సల్కర్‌పేట్, రుసుంపల్లి మన్సూర్‌పల్లి, జిన్నారం, కష్లాపూర్ గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో సాగు కాగా, చెల్మిల్లా, చిన్నవార్వాల్, రెడ్డిపల్లి, పెద్దవార్వాల్, సాలార్‌నగర్ గ్రామాల్లో తక్కువ మొత్తంలో సాగు అవుతున్నది.


ఆయిల్‌పాం మొక్కను పరిశీలిస్తున్న హార్టికల్చర్ డీడీ వేణుగోపాల్

ఆశించిన దిగుబడి..

ఈ సాగుతో ఆశించిన దిగుబడితో పాటు చక్కటి లాభాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి పంట చేతికి వస్తుంది. మొదటగా ఆరు నుంచి ఎనిమిది టన్నుల దిగుబడి వస్తుంది. 7వ ఏట నుంచి పది నుంచి 16టన్నుల దిగుబడి వస్తుంది. ఇప్పటికే జిల్లాలో దిగుబడులు వస్తున్నట్లు హార్టికల్చర్ అధికారుల పేర్కొంటున్నారు. ఒక్కో టన్ను రూ.13వేల ధర పలుకుతుంది.

అంతర పంటగా కలింగ..



8ఎకరాల్లో ఆయిల్‌పాం తోట పెట్టాం. రెండో ఏడాది కావస్తుంది. ఖాళీగా ఉండకుండా అంతర పంటగా కలింగ పండ్ల పంట పండించాను. దీని ద్వారా ఆశించిన లాభాలు వస్తున్నాయి. మరో రెండేళ్లలో పంట చేతికి వస్తుంది. పల్లీ, తెల్ల, నల్ల కుసుమల సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఆయిల్‌పాంకు మంచి డిమాండ్ ఉంటుందన్న ఉద్దేశ్యంతో తోట పెట్టాం. డ్రిప్ విషయంలో పేర్కొన్న రాయితీ పూర్తిస్థాయిలో రావడం లేదు. – పల్లె బాలవర్ధన్‌రెడ్డి, రైతు, కష్లాపూర్

పది ఎకరాల్లో సాగు



ఏ పంట సాగు చేసిన ఆశించిన లాభాలు రావడం లేదు. ఇన్నాళ్లుగా చాలా ఇబ్బందులు పడ్డాం. ఆయిల్‌పాం సాగు మేలని అనిపించింది. రెండేళ్ల క్రితం పది తోట పెట్టాం. డ్రిప్ కూడ ఏర్పాటు చేశాం. రెండేళ్లలో అంతర పంటలు వేశాం. మంచి లాభాలు వచ్చాయి. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఆయిల్‌పాం సాగు రైతులకు మేలు చేకూరుతుంది. – బిందారి బాబు, రైతు, సల్కర్‌పేట్

చైతన్యం తీసుకొస్తాం..



ఆయిల్‌పాం తోటల్లో చక్కటి లాభాలు ఉన్నాయి. బత్తాయి సాగు కంటే కూడా తక్కువ శ్రమ ఉంటుంది. దీంతో పాటు పెట్టుబడి నిర్వహణ భారం తక్కువగా ఉంటుంది. మార్కెటింగ్ కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. ఈ సాగుకు రాయితీలు కల్పిస్తున్నాం. రైతులకు అవగాహన కల్పించి తోటలు విస్తరించేలా చర్యలు తీసుకుంటాం. మెయింటెనెన్స్ ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగింది. కోడ్ పూర్తవ్వగానే రైతులకు అందేలా చూస్తాం. – వేణుగోపాల్, డీడీ, హార్టికల్చర్, మహబూబ్‌నగర్ జిల్లా

మొక్కలు రాయితీపై

ఆయిల్‌పాం సాగుకు రాయితీ ఎక్కువ మొత్తంలో ఉండడంతో రైతుల ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో మొక్కకు రూ.200 వెచ్చించి కొనుగోలు చేయాలి. ప్రభుత్వం రూ.190 ఒక్క మొక్కకు సబ్సిడీ ఇస్తుంది. రైతు వాటా మాత్రం మొక్కకు రూ.20 చెల్లించాలి. ఈ మొక్కలు ఇదివరకు కొత్తకోట వద్ద కదుకుంట్ల నర్సరీ ద్వారా సరఫరా చేసేవారు. ఇపుడు పాలెం నర్సరీ నుంచి సరఫరా చేస్తున్నారు. ఈ మొక్కలు ఎకరాకు 50 నుంచి 55 వరకు నాటుతారు. వీటి మెయింటెనెన్స్‌కు ఏడాదికి రూ.2,100 చొప్పున నాలుగేళ్ల వరకు రైతుకు చెల్లిస్తారు. దీంతో పాటు చెరుకు, వరి తప్ప ఇతర ఏవైనా అంతర పంటలు వేసుకుంటే ఎకరాకు రూ.2100 చొప్పున నాలుగేళ్లకు రూ.8,400 రైతుకు చెల్లిస్తారు. డ్రిప్ ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ కాగా, బీసీ సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం, ఇతర కులాల రైతులకు 80 శాతం సబ్సిడీ ఉంది.

విశేషాలంకరణలో కందూరు రామలింగేశ్వరుడు



అడ్డాకుల: ఉగాది సందర్భంగా మంగళవారం మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుడు మణికంఠ శివాచార్య హిమాలయ పర్వతాల్లో పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి తపస్సు చేస్తున్నట్లుగా చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. గౌరమ్మ ఆలయంలో అర్చకులు పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ, అకౌంటెంట్ అనంతసేన్‌రావు, అర్చకులు మణికంఠ శివాచార్య, రామలింగశర్మ, యాదగిరి, ఉత్సవ కమిటీ చైర్మన్ రవీందర్‌శర్మ, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఉగాది ‘ఉపాధి’

- పండుగపూట జోరుగా భక్షాల విక్రయాలు
- పట్టణంలో పలుచోట్ల తయారీ, విక్రయ కేంద్రాలు


భక్షాలు తయారు చేస్తున్న కౌసల్య


విక్రయానికి సిద్ధంగా ఉన్న భక్షాలు

జడ్చర్ల టౌన్: ఉగాది పర్వదినం రోజున మున్సిపాలిటీ పరిధిలో భక్షాల విక్రయాలు జోరుగా సాగాయి. తెలుగు నూతన సంవత్సరం ఉగాది అనగానే షడ్రుచులతో కూడిన పచ్చడితో పాటు బెల్లం, చక్కెరతో చేసే భక్షాల వంటకం ప్రత్యేకం. ఈ రెండు ఉంటేనే ఉగాది పండగ చేసుకున్నట్లు లెక్క. దీంతో పట్టణంలో పలుచోట్ల వాటిని తయారు చేసి విక్రయిస్తుండటంతో పండగ ఒక్కరోజే అన్ని కేంద్రాల్లో కలిపి 10వేలకు పైగా అమ్ముడయ్యాయి. భక్షాల తయారీ పలువురికి ఉపాధిగా మారింది. యాంత్రిక జీవనం, పనిఒత్తిడి తదితర కారణాలతో భక్షాలు ఇళ్లల్లో తయారు చేసుకునేందుకు చాలామందికి అవకాశం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో భక్షాల తయారీ, విక్రయాలు వరంగా మారుతున్నాయి. సాధారణ రోజుల్లోనూ స్వీట్స్ దుకాణాలు, కొన్ని హోటళ్లలో నేటికి భక్షాలు లభిస్తున్నాయి. కానీ ఉగాది, దసరా పండుగ రోజున భక్షాలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. రెండు పర్వదినాల కోసం ముందుగానే ఆర్డర్లు ఇచ్చి రెడీ చేయించుకుంటారు. చిన్న కుటుంబం అయితే 5, పెద్ద కుటుంబం అయితే 20 నుంచి 40 వరకు భక్షాలను కొనుగోలు చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో సాయినగర్ కాలనీ, వాసవీ కాంపౌండ్, జడ్చర్ల బాలాజీ నగర్‌లో పలువురు భక్షాలను తయారు చేసి విక్రయిస్తున్నారు.

బెల్లం భక్షాలకు పెరుగుతున్న డిమాండ్

తెలంగాణ ప్రాంతంలో భక్షాలు అని, ఆంధ్ర, మహారాష్ట్ర, యూపీలోని కొన్ని ప్రాంతాల్లో బొబ్బట్లు, పోలెలు అని పిలుచుకుంటుంటారు. భక్షాలను మైదా పిండి, బెల్లం, చక్కెర, ఇలాచీలు ఉపయోగించి చేస్తుంటారు. అయితే ఏటా బెల్లం భక్షాలకు డిమాండ్ పెరుగుతోంది. ఆరోగ్యరీత్యా బెల్లం వినియోగం మంచిదనే అభిప్రాయం ఉండటంతో వాటిపై కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. కాగా చక్కెర భక్షం అయితే ఒకటి రూ.16–రూ. 18, బెల్లం భక్షం రూ.18–రూ. 20గా విక్రయిస్తున్నారు. వీటితోపాటు రవ్వభక్షాలు, పూర్ణం భక్షాలు, నేతిబెల్లం భక్షాలు సైతం చేస్తుంటారు.

భక్షాలు ఉండాల్సిందే..



ఉగాది పండగ కావటం వల్ల 15 భక్షాలు కొనుగోలు చేశాను. ఉగాది అంటేనే పచ్చడి, భక్షాలు ఉండాల్సిందే. సాధారణంగా ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా, ప్రధాన పండుగలు వచ్చి నా ఇతర స్వీట్లు చేసుకుంటాం. అయితే తెలుగు నూతన సంవత్సరం కావటం వల్ల భక్షాలు ఉండాల్సిందే. ఇంట్లో పనిఒత్తిడి, సమయాభావం వల్ల ఇలా నాలుగేళ్లుగా బయటే కొనుగోలు చేస్తున్నాం. దీనివల్ల సమయం ఆదా అవుతుంది.
–చింతకాయల కౌటిల్య, విజయ్‌నగర్ కాలనీ, జడ్చర్ల

ఏటా ఆర్డర్లు పెరుగుతున్నాయి

కొన్నేళ్లుగా భక్షాలు తయారు చేస్తున్నాం. ఉగాది, దసరా పండుగ రోజుల్లో భక్షాలకు ఏటా ఆర్డర్లు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఉగాదికి 1,200ల ఆర్డర్లు వచ్చాయి. ముందుగా చెప్పకుండా వచ్చే వారు కొందరుంటారు వారికి చేసి ఇస్తున్నాం. భక్షాల తయారీ అప్పటికపుడే చేయాల్సి ఉన్నందున ఎక్కువ ఆర్డర్లు వస్తున్నా చేయలేకపోతున్నాం. ముందురోజు రాత్రి నుంచి తెల్లవార్లు చేస్తేనే ఉదయం కొనుగోలుదారులకు అందించగలుగుతున్నాం.
–కోటకాడి కౌసల్య, బాలాజీనగర్, జడ్చర్ల.

మద్యం, నగదు పట్టివేత


నారాయణపేటలో పట్టుబడిన మద్యం సీసాలు

నారాయణపేట రూరల్: టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేపట్టిన దాడుల్లో మద్యం పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ కృష్ణదేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మన్‌పాడుకు చెందిన మహేష్‌సింగ్ మంగళవారం నారాయణపేట నుంచి బైక్‌పై 36.05లీటర్ల మద్యంను అక్రమంగా తీసుకెళ్తున్నాడు. అప్పక్‌పల్లి వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీ చేయగా రూ.15,862విలువ గల మద్యం పట్టుబడింది. మద్యం స్వాధీనం చేసుకుని మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.96వేలు నగదు పట్టివేత

అలంపూర్: పుల్లూరు చెక్‌పోస్టులోని వాహన తనిఖీలలో భాగంగా మంగళవారం కడప నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తున్న వ్యక్తి వద్ద రూ.96వేలు నగదు పట్టుకుని ఎస్ఐ శ్రీనివాసులుకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు చెక్‌పోస్టులో వాహన తనఖీలలో భాగంగా బస్సులో కడప నుంచి హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి కూరగాయాల మార్కెట్‌కు వెళ్తున్న నరేష్ వద్ద నగదు ఉండడంతో పట్టుకుని జిల్లా గ్రీవెన్స్ సెల్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

540 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

వెల్దండ: మండలంలోని 9 ప్రాంతాల్లో మంగళవారం ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పోతేపల్లి ఉమ్మడి పంచాయతీ పరిధిలోని రావిచెట్టుబావితండాలో మోహన్ నుంచి 18బస్తాల్లో 540 క్వింటాళ్ల నల్లబెల్లం, బస్తా పటికను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. తనిఖీ చేసే క్రమంలో రావిచెట్టుబావితండాకు చెందిన కొంత మంది సారా వ్యాపారులు ఎక్సైజ్ అధికారులపై దాడులు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



వెల్దండ మండలం రావిచెట్టుబావితండాలో స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం

చెక్‌పోస్టు వద్ద వెండి వస్తువుల పట్టివేత


వెండి వస్తువులు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణలోకి తీసుకుని వస్తున్న వెండి వస్తువులను చెక్‌పోస్టు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోడ్ అమలు ఉంది. ఎక్లాస్‌పూర్ వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. యాద్గీర్ జిల్లా దంతాపురానికి చెందిన వీరేష మంగళవారం రూ.31 వేల విలువ చేసే 427 గ్రాముల వెండి వస్తువులను నారాయణపేటకు తీసుకుని వస్తున్నాడు. తనిఖీ చేస్తుండగా.. గుర్తించిన పోలీసులు వాటికి సంబంధించిన పత్రాలు చూపాలని కోరారు. ఆయన వద్ద లేవని సమాధానం చెప్పాడంతో వెంటనే స్వాధీనం చేసుకుని వాటిని గ్రీవెన్స్ కమిటీకి పంపించారు.

ఈత వనం దగ్ధం



మాగనూర్: కొత్తపల్లి శివారులో ఈత వనాన్ని ఉద్దేశపూర్వకంగా దగ్ధం చేసి కల్లుగొబ్బలను ధ్వంసం చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఘటనపై కొత్తపల్లి గీత కార్మికులు దేవరాజు నారాయణపేట అబ్కారీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నాడు. ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తోటలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 1200లకు పైగా చెట్లు కాలి బూడిదయ్యాయన్నారు. కల్లు అమ్మకం మీద ఆధారపడి జీవిస్తున్న వారు రోడ్డున పడినట్లు తెలిపారు. వారం రోజుల క్రితం ఇలాగే నిప్పుపెట్టగా అప్రమత్తమై మంటలను ఆర్పినట్లు పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు ఇలా చేశారన్నారు. బాధ్యులను శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆలయ చరిత్రను కాపాడుదాం


ఆలయ చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేస్తున్న పురావస్తు నిపుణుడు శివనాగిరెడ్డి

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ఉగాది పండుగ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సందర్శించారు. పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డితో కలిసి ఆలయంలోని శివలింగానికి పూజలు చేశారు. ఆలయ పరిసరాలు గుప్తనిధుల వేటలో ధ్వంసమైన నేపథ్యంలో ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ కమిటీ ద్వారా పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో ఇందుకు సంబంధించిన ప్రణాళిక గురించి ఈమని శివనాగిరెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. ఆలయ ప్రాముఖ్యత, పురాతన కాలంలో ఆలయం వెలుగొందిన చరిత్ర గురించి శివనాగిరెడ్డి క్లుప్తంగా తెలియజేశారు. ఆలయ చరిత్రకు సంబంధించిన శివనాగిరెడ్డి రూపొందించిన పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. చారిత్రాత్మక నేపథ్యం ఉన్న ఆలయాన్ని కాపాడుకునేందుకు అందరం కలిసి కృషి చేద్దామని ఎమ్మెల్యే సూచించారు. ఆలయ చరిత్రను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా సాయం అందేలా కృషి చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం అచ్చాయపల్లిలో అంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. ఎమ్మెల్యేగా జీఎంఆర్ గెలిస్తే ఆలయంలో 116 కొబ్బరి కాయలు కొడతామని మొక్కుకున్న స్థానిక నాయకులు ఎమ్మెల్యే పూజలు చేసిన తర్వాత ఆయన సమక్షంలో మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ చైర్మన్ నరేందర్, నాయకులు బాలనర్సిములు, జగదీశ్వర్, బగ్గి కృష్ణయ్య, లక్ష్మినారాయణ, గోవర్ధన్, తిరుపతయ్యగౌడ్, కృష్ణయ్య, నారాయణ, విశ్వేశ్వర్ తదితరులున్నారు.

కార్మికుల వినూత్న నిరసన


వంటా వార్పు నిర్వహిస్తున్న కార్మికులు

పాలమూరు: వేతన బకాయిలు చెల్లించాలంటూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులు మంగళవారం ఆస్పత్రి ఆవరణలోని సాయి సెక్యూరిటీ ఏజెన్సీ కార్యాలయం గేటుకు తాళం వేసి అక్కడే వంటా వార్పు నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా అక్కడే భక్షలు, ఇతర వంటలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. పండుగ పూట కూడా వేతనాలు చెల్లించకుండా కార్మికులను పస్తులుంచడం సిగ్గుచేటన్నారు. వేతన చెల్లింపుల్లో ఏజెన్సీ నిర్వాహకులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఏప్రిల్‌లో ఉగాది, రంజాన్ పండుగలున్నాయని పదే పదే చెబుతున్నా స్పందించకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల బకాయి వేతనాలు విడుదల చేసినా ఏజెన్సీ నిర్వాహకులు కార్మికులకు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. జీవన్ అక్కడికి చేరుకొని ఏజెన్సీపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పాటు పండుగకు ఏజెన్సీ నుంచి కొంత అడ్వాన్స్ ఇప్పించడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

నెట్‌వర్క్ సేవలు మెరుగుపర్చండి

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారిలోని మన్ననూర్‌లో జియో, ఐడియా నెట్‌వర్క్ సేవలు మెరుగుపరచాలని వినియోగదారులు కోరుతున్నారు. గతంలో ఆయా నెట్‌వర్క్‌లకు తక్కువ మంది వినియోగదారులు ఉండడంతో, అప్పట్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సమయాల్లో సిగ్నల్స్ బాగా అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వినియోగదారుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రత్యేకించి ప్రధాన రహదారిలో రాకపోకలు చేసే వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వారు నెట్‌వర్క్ ఉండకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫొటోగ్రాఫర్‌కు అవార్డు

పెద్దకొత్తపల్లి: ఉగాది పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని తంబాలలో వీపీ ఫొటోగ్రాఫ్ అకాడమి వారు నిర్వహించిన ప్రబలతీర్థ ఫొటోవాంక్ కాంటెస్ట్‌లో 150 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ పోటీలలో మండలానికి చెందిన ఫొటోగ్రాఫర్ పిట్టల మహేష్ మెరిట్ అవార్డును గెలుపొందాడు. ఆయనను ఫొటోగ్రాఫర్‌ల సంఘం నాయకులు రాజు, శ్రీనివాసులు అభినందించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

పెద్దకొత్తపల్లి: వెనచర్లలో ఉగాది సందర్భంగా కబడ్డీ పోటీలను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మంగళవారం ప్రారంభించారు. పోటీలలో 32 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో రాధ, ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ రవికుమార్, బాలస్వామి, చిన్నయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కల్వకుర్తి సాహితి సమితి ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. 20 మంది కవులు సమ్మేళనంలో కవితలు వినిపించారు. సాహితి సమితి అధ్యక్షుడు శీనయ్యగౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కవులను ఆలయ చైర్మన్ మనోహర్ సత్కరించారు.

15న సీఎం రేవంత్‌రెడ్డి రాక



నారాయణపేట: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల శంఖారావం పూరించేందుకు ఈనెల 15న నారాయణపేటలో నిర్వహించనున్న జనజాతర బహిరంగ సభకు సీఎం ఎనముల రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి చెప్పారు. మంగళవారం సీవీఆర్ భవన్‌లో స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట జిల్లా రద్దు అవుతుందని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలు అని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి అలాంటి ఆలోచన లేదని స్పష్టంచేశారు. జీఓ 69 ఒక కల అని, దాన్ని రేవంత్‌రెడ్డి సారథ్యంలో జీఓ 14 ద్వారా నెరవేరుతుందన్నారు. ఈ పథకం సాధించడంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పేట ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డిల కృషి ఎంతో ఉందన్నారు. గతంలో ఎన్నికైన నేతలు ఈ ప్రాంతానికి చేసిందేమీలేదన్నారు. పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా వచ్చి ఉంటే, 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని తెలిపారు. డీకే అరుణ మంత్రిగా ఉన్నప్పుడు జిల్లాకు చేసిందేమీలేదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కష్టకాలంలో ఉంటే, అధికారంలో ఉన్న బీజేపీలోకి వెళ్లిందన్నారు. ఆమె బీజేపీలోకి వెళ్లిన తర్వాత జిల్లాకు ప్రత్యేకంగా ఏమైనా తీసుకొచ్చినట్లు చెబితే, తాను పోటీలో ఉండనని.. లేకపోతే ఆమె పోటీలో నిలబడరాదన్నారు. ఇక్కడి నుంచి సైనిక్ స్కూల్ తరలిపోతుంటే ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఎంపీగా తనను ఎన్నుకుంటే.. ఏం చేస్తానో రాజకీయ సభలో చెబుతానన్నారు. రానున్న ఎన్నికల్లో జర్నలిస్టులు సైతం కాంగ్రెస్ పక్షాన నిలవాలని కోరారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రెస్ అకడామీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జనజాతర బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వంశీచంద్‌రెడ్డికి భారీ మెజార్టీ అందిస్తాం..

కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి నారాయణపేట నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ అందిస్తామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పార్టీ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో తాము సాధించిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.2,945 కోట్లు పరిపాలనా అనుమతులు తీసుకొచ్చినట్లు తెలిపారు.



మామిళ్లపల్లిలో పంచాంగ శ్రవణం



పెంట్లవెల్లి మండలం గోపులాపూర్‌లో..



లింగాల కోదండరామాలయంలో..

ఆనందోత్సవాల ఉగాది

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పంచాంగ శ్రవణం విన్న ప్రజలు



వెల్దండలో..



జూపల్లిలో పంచాంగ శ్రావణంలో పాల్గొన్న గ్రామస్తులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా వారి నివాసాలను శుభ్రపరుచుకుని, మామిడి తోరణాలతో అలంకరించి, షడ్రుచులతో పచ్చడి, భక్ష్యాలు తదితర పిండి వంటలు చేసుకుని ఆనందంగా గడిపారు. క్రోధి నామ సంవత్సరంలో శుభం కలగాలని ఇళ్లలోని దేవుళ్లకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

■ చారకొండ మండలంలో సిర్సనగండ్ల, జూపల్లి, చంద్రాయన్‌పల్లి దేవాలయాల వద్ద పురోహితులు పంచాంగ శ్రవణాలు చదివి వినిపించారు.

■ కల్వకుర్తి పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్, వాసవీకన్యకాపరమేశ్వరి, వేంకటేశ్వరస్వామి, శివాలయానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి పూజలు చేశారు. పట్టణంలోని మైసమ్మ దేవాలయ సమీపంలో స్వామివివేకనందా సేవా బృందం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

■ ఉప్పునుంతల మండలంలో కేదారేశ్వరాలయం, మామిళ్లపల్లి, అయ్యవారిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు, వెల్టూరు, పెనిమిళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉన్న దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.

■ పెంట్లవెల్లి మండల పరిధిలోని మంచాలకట్ట, గోపులాపూర్ మహిళలు, పెద్దలు ఆలయాలను దర్శించుకున్నారు. మంచాలకట్టలో ఉగాది సందర్భంగా యువకులకు కాంగ్రెస్ కార్యకర్తలు క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

■ తెలకపల్లి మండల ప్రజలు ప్రధాన దేవాయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శ్రీకాంత్‌శర్మ, గౌరారంలో గంటమఠం నాగభూశనయ్య, గట్టునెల్లికుదురులో రాచయ్య పంచాంగ శ్రవణ పఠనం నిర్వహించారు. గ్రామాలలో రైతులు, ప్రజలు తమ జాతక ఫలాలను రాశుల వారిగా అడిగి తెలుసుకున్నారు.

■ లింగాల మండల కేంద్రంలోని కోదండరామాలయంలో రామాచారి, సుదర్శనాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం వినేందుకు ప్రజలు తరలివచ్చారు.

■ మన్ననూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుడు నర్సింహశర్మ తెలుగు కొత్త సంవత్సరం పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ఆలయం వద్దకు చేరుకుని తమ పేరు బలాలు, కుటుంబాల యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు.

■ కోడేరు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి, పంటలు పండుతాయని పూజారి రాఘవేంద్రశర్మ తెలిపారు.


■ అచ్చంపేట పట్టణంలో పండుగ ప్రత్యేకతను చాటే షడ్రుచుల పచ్చడిని ఆలయాల్లో పంపిణీ చేశా రు. పలు ఆలయాల్లో పంచాంగకర్తలు పంచాంగ శ్రవ ణం చేశారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి, భ్రమరాంబ, ఆంజనేయ అయ్యప్ప, భక్త మార్కండేయ ఆలయం వద్ద పంచాంగ శ్రవణం చేశారు.



అచ్చంపేట భక్తమార్కండేయ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



తెలకపల్లిలో..



కోడేరు ఆంజనేయ స్వామి ఆలయంలో..



తాడూరులో..



పెద్దకొత్తపల్లిలో..



అచ్చంపేట భ్రమరాంబ ఆలయంలో..

చేతిపంపును బాగు చేయించండి



గౌరారంలో వృథాగా పడి ఉన్న చేతిపంపు

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో ఎస్సీకాలనీలో ఉన్న చేతిపంపుతోపాటు ఓవర్‌హెడ్ ట్యాంక్ వెనకాల ఉన్న మరోచేతి పంపును బాగు చేయించాలని కోరుతున్నారు. చేతిపంపులలో ఉన్న పైపులు రంధ్రాలు పడి నీరు రావడం లేదని చాలాసేపు కొట్టిన తర్వాత ఒంద్రు నీళ్లు వస్తున్నాయని ఆవేదన తెలియజేశారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో నీటి సమస్య ఏర్పడుతుందని పంపింగ్ బోర్‌లు చెడిపోయినప్పుడు ఈ చేతి పంపులే ఉపయోగపడుతాయని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా కల్వర్టు పనులు

తాడూరు: మండలంలోని అల్లాపూర్, మేడిపూర్ మధ్య దాదాపు ఆరు నెలల క్రితం బీటీ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా అల్లాపూర్ సమీపాన కల్వర్టు నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. రాత్రి వేళల్లో ప్రయాణం ఆందోళన కలిగిస్తుందని, పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రయాణం నరకయాతనగా తయారైందని ఆయా గ్రామాల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి అసంపూర్తిగా వదిలిన కల్వర్టును పూర్తి చేయాలని ప్రజలు కోరారు.



అల్లాపూర్ సమీపంలో అసంపూర్తిగా కల్వర్టు

పాఠశాల భవనం ప్రారంభమెప్పుడో?



పూర్తయిన పాఠశాల భవనం

తాడూరు: మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా అధునాతన హంగులతో పాఠశాల భవనాన్ని నిర్మాణం చేపట్టారు. పాఠశాల పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థుల చదువు కుంటుపడింది. కళాశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో కొన్నాళ్లు నిర్వహణ కొనసాగించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు ఒకపూట విద్యా బోధనపై చాలా మంది విద్యార్థులు చదువుకు దూరం అయ్యారు. ప్రస్తుతం పాఠశాల భవన నిర్మాణ పనులు 10 శాతం మేర చేయాల్సి ఉందని, పనులు పూర్తి చేసి భవనాన్ని ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న విజయ్

తాడూరు: రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జి విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రకృతి సానుకూలంగా ఉండి, వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారని, ఈ తెలుగు సంవత్సరంలో అయిన ఎంఎస్ స్వామినాథన్ సిఫారసుల ప్రకారం గిట్టుబాటు ధర కల్పించి, పండించిన పంటకు రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు. సమావేశంలో నిరంజన్, శ్రీనివాసులు, వెంకటయ్య, మాసయ్య, పకీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవాలు



ముత్యాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

ఉప్పునుంతల: మండలంలోని గుట్టమీదితండాలో ఉగాదిని పురస్కరంచుకుని మంగళవారం గిరిజనుల ఆరాధ్యదైవమైన ముత్యాలమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు సాగే ఉత్సవాలలో మొదటిరోజు అమ్మవారి విగ్రహాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల వంటకాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తండాకు వెలుపల ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్ద మహిళలు, యువకులు డప్పుల దరువుకు నృత్యాలు చేసి సంతోషాన్ని పంచుకున్నారు. రాత్రివేళ భజన కార్యక్రమాలు చేపట్టి బుధవారం విందు చేసుకుంటామని గిరిజన నాయకులు తెలిపారు. ఉత్సవాల్లో పాలుపంచుకోవడానికి దూరప్రాంతాలకు వెళ్లిన కుటుంబసభ్యులతోపాటు బంధువులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఎండాకాలం జీవాలకు గండం



నీరు లేక ఎండిన కేఎల్ఐ కాల్వ

- తొట్లలో నీరులేక పశువుల కాపరుల ఆందోళన
- మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు కొరవడిన చర్యలు

తాడూరు: అడుగంటిన నీటి వనరులతో పశుకాపరులు, పాడి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. మండే ఎండల్లో అన్నదాతల గుండెల్లో ఆందోళన మొదలైంది. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో చెరువులలో నీరు అడుగంటిపోవడంతోపాటు బోర్లు, బావులలో నీరు కరువైంది. ప్రస్తుతం ఎండల తీవ్రత దృష్ట్యా భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. దీంతో గొర్రెలు, మేకల పెంపకందారులు డెయిరీ, పౌల్ట్రీ ఫాంలను నిర్వహించే వారు నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నిరుపయోగంగా మారిన నీటి తొట్టి

400 మందికి పైగా కాపరులు

24 పంచాయతీల్లో దాదాపు 400 మందికి పైగా కాపరులు ఉన్నారు. 57,588 గొర్రెలు, మేకలను పెంచుతున్నారు. పశువులు 8,143, పాడిగేదెలు 4,593 మండలంలో ఉన్నాయి. కేఎల్ఐ కాల్వల ద్వారా వచ్చే నీరు రెండు నెలల క్రితమే బంద్ అయ్యింది. ప్రస్తుతం కేఎల్ఐ కాల్వలలో కంపచెట్లు మొలిచాయి. గ్రామాలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈజీఎస్, ఉపాధి పథకాల ద్వారా గతంలో నిర్మించిన నీటి తొట్లు ఎందుకు పనికిరాకుండా ఉన్నాయి. మే నెలలో ఎండల తీవ్రత మరింత ఎక్కువవుతుందేమోనన్న ఆందోళనకు రైతులు గురి అవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు చేపట్టి మూగజీవాల దాహార్తి కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా నీటిని అందుబాటులో ఉంచేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారులకు తెలియజేస్తాం

ఎండలు తీవ్రంగా అవుతున్న కారణంగా మండలంలోని పలు గ్రామాలలో పాడి పశువులు, మేకలు నీటి ఎద్దడితో తల్లడిల్లే అవకాశం ఉంది. ఆయా గ్రామాలు పరిశీలించి అధికారులకు నివేదిక అందజేస్తాం.

– రాజేష్‌కుమార్, పశువైద్యాధికారి

చర్యలు తీసుకుంటాం

మండలంలోని పలు గ్రామాలలో పాడిపశువులు, గొర్రెల, మేకలకు నీటి ఎద్దడి తలెత్తకుండా తాము చర్యలు తీసుకుంటాం. ఎండల తీవ్రత చూస్తే మరో రెండు నెలలు భూగర్భ జలాల పరిస్థితి దారుణంగా మారే అవకాశం ఉంది. ఎంపీడీఓ, గ్రామాల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీదేవి, ఎంపీపీ

మామిడి రైతుల పాట్లు



పెద్దకొత్తపల్లిలో మామిడి తోట

పెద్దకొత్తపల్లి: మండలంలో రైతులు సాగుచేసిన మామిడి తోటలను వేసవి నుంచి కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఈ ఏడాది వర్షాకాలంతో బోర్లు మొత్తం ఇంకిపోవడంతో నీటి కొరత ఏర్పడింది. రైతులు ఉన్న కొద్దిపాటి నీటితో చెట్లను కాపాడుకునేందుకు డ్రిప్ పద్ధతిని పాటిస్తున్నారు. మండలంలోని 25 పంచాయతీలలో 25,930 ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా మామిడి తోటలు పెంచిన మండలం ఇదే. ఈ తోటలను కాపాడుకునేందుకు రైతులు బావులు, చెరువులు, బోర్‌ల నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది కేఎల్ఐ ప్రాజెక్ట్ ద్వారా నీరు పుష్కలంగా రాకపోవడంతో కరువు పరిస్థితి దాపరించింది.

బోరు ఇంకిపోయింది



నేను ఏడు ఎకరాలలో మామిడి తోట వేశాను. ప్రస్తుతం ఉన్న బోర్‌లో నీరు ఇంకిపోవడంతో తోటను బతికించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాను. పక్క రైతులతో నీటిని తీసుకుని చెట్లకు పారిస్తున్నాను. మొత్తం 480 చెట్లు ఉన్నాయి. – కొత్త లింగారెడ్డి, పెద్దకొత్తపల్లి

ఉగాది వేడుకల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్ దంపతులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నిర్వహించిన ఉగాది పూజా కార్యక్రమాల్లో సీఎం జగన్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని వేద పండితులు ఆశీర్వదించారు. తీర్థప్రసాదాలు, ఉగాది పచ్చడిని అందజేయగా సీఎం జగన్ దంపతులు స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ మంచి జరగాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. 'రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో నా అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు, విద్యార్థులు అందరికీ మంచి జరిగి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్ చేశారు.



పల్నాడు జిల్లా గంటావారిపాలెంలో జరిగిన ఉగాది వేడుకలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతికి ఆశీర్వచనం అందజేస్తున్న వేద పండితులు



తన సతీమణి వైఎస్ భారతీ రెడ్డి నుదుటిన బొట్టు పెడుతున్న సీఎం జగన్

నేను బాధితురాలిని

కోర్టులో ప్రస్తావించేందుకు రాసుకొచ్చిన 4 పేజీల లేఖలో కవిత

సాక్షి, న్యూఢిల్లీ: 'నా హక్కులకు భంగం కలగకుండా, ఈ కేసులో పేర్కొన్న విషయాల్లో నాకు ఎలాంటి ప్రమేయం లేదా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేదని చెప్పాలనుకుంటున్నా. రెండున్నరేళ్లుగా ఈడీ/సీబీఐ దర్యాప్తు ముగింపు లేని దర్యాప్తుగా సాగడం ప్రపంచమంతా చూస్తోంది. ఈ విషయంలో మహిళా రాజకీయ నాయకురాలిగా ఇతరులకన్నా ఎక్కువ బాధితురాలిని నేనే. ఈ కేసు నా వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసింది. నా వ్యక్తిగత ఫోన్ నంబర్ అన్ని టీవీల్లో ప్రసారం చేయడం నా గోప్యతకు భంగం కలిగిస్తోంది. నేను దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరించాను. వారి ముందు నాలుగుసార్లు హాజరయ్యాను. నాకు తెలిసినంత వరకూ వారికి సమాధానమిచ్చాను. నా బ్యాంకు, వ్యాపార వివరాలు తెలియజేశాను. నా ఫోన్లు దర్యాప్తు సంస్థకు ఇచ్చి పూర్తిగా సహకరించినా వాటిని ధ్వంసం చేశానని నిందిస్తున్నారు. రెండున్నరేళ్లలో దర్యాప్తు సంస్థలు అనేక మంది విషయంలో పలుసార్లు దాడులకు పాల్పడటంతోపాటు మానసికంగా, శారీరకంగా వేధించి, బెదిరించి అరెస్టు చేశాయి. అయినప్పటికీ తమ ప్రకటనలను, రాజకీయ పొత్తులను మారుస్తూ వచ్చిన వారి నుంచి కొన్ని స్టేట్‌మెంట్లు సేకరించాయి. ఈ కేసు మొత్తం వాంగ్మూలాల మీదే ఆధారపడి ఉంది. కేసులో డబ్బు లావాదేవీలు ఎక్కడా లేవని... అవినీతికి సంబంధించిన ఆధారాలు లేవనడాన్ని తోసిపుచ్చలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. సాక్షుల్ని తారుమారు చేశారని ఈడీ ఆరోపిస్తోంది. మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నన్నెందుకు అరెస్టు చేయలేదు. రెండున్నరేళ్ల దర్యాప్తు విఫలమైన తర్వాత సార్వత్రిక ఎన్నికలకు ముందు కేవలం స్టేట్‌మెంట్ల ఆధారంగా ఎలాంటి ఆధారాలు లేకుండా మార్చి 15న ఈడీ అరెస్టు చేసింది. నాపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ అరెస్టు చేసింది. ప్రస్తుతం ఈడీ/సీబీఐ కేసుల్లో 95 శాతం ప్రతిపక్షాలపైనే ఉన్నాయి. నిందితులు బీజేపీలో చేరితే దర్యాప్తు ఆకస్మికంగా నిలిచిపోతోంది. నోరుమెదపకండి లేకపోతే ఈడీని పంపుతామని బీజేపీ నాయకులు పార్లమెంటు వేదికగానే బెదిరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీలు ఏదైనా ఉపశమనం లభిస్తుందని న్యాయస్థానాలు వైపు చూస్తున్నాయి. నేను ఈడీ ప్రక్రియ విధానాలకు సహకరించడం తప్ప ఏమీ చేయలేను. ఆ విధంగానే కొనసాగుతున్నాను. అందుకే నాకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతున్నా. నా జీవితంలో ముఖ్యమైన విషయం ఏంటంటే బాధ్యాతయుతమైన తల్లిగా ఉండాలని కోరుకుంటున్నాను. నేను చాలా అర్హతలు కలిగిన వ్యక్తిని. అందుకే కుమారుడు బోర్డు పరీక్షలు, ఆప్టిట్యూడ్ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు నా పాత్ర ఏమిటో అర్థం చేసుకున్నాను. నేను ప్రపంచానికి దూరంగా ఉండే వ్యక్తిని కాదు. నేనేమీ ఒకే సంతానం కలిగిన తల్లిని కాదు. తల్లి స్థానాన్ని భర్తీ చేయగలమా? చదువు విషయంలో నా కుమారుడుకి ఇది చాలా క్లిష్టమైన సంవత్సరం. నేను గైర్హాజరు కావడం కుమారుడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని భయపడుతున్నా. అందుకే నా బెయిల్ అభ్యర్థన పరిశీలించాలని మళ్లీ కోరుతున్నా' అని కోర్టులో స్వయంగా ప్రస్తావించేందుకు రాసుకొచ్చిన 4 పేజీల లేఖలో కవిత పేర్కొన్నారు. అయితే ముందుగా దరఖాస్తు చేసుకోనందున కోర్టు అనుతించకపోవడంతో ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు.

అయ్యో వైష్ణవి

- మూడేళ్ల వయసులో తల్లి వదిలేసింది
- రెండేళ్ల క్రితం తండ్రి ఆత్మహత్య
- ఇప్పుడు ఆ బాలిక బలవన్మరణం
- దుండిగల్ స్ఫూర్తి ఫౌండేషన్‌లో ఘటన



వైష్ణవి (ఫైల్)

దుండిగల్: మూడేళ్ల వయస్సు ఉన్నప్పుడే తల్లి వదిలేసి వెళ్లిపోయింది.. రెండేళ్ల క్రితం తండ్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదకొండేళ్ల వయస్సులోనే ఈ రెండు ఘటనలు ఆ బాలికను కలచివేశాయి. అయినాసరే తట్టుకుని చదువుతోంది.. కానీ ఇప్పుడు అర్ధంతరంగా ఏమైందో ఏమో అనుమానాస్పద స్థితిలో అనాథాశ్రమంలో బలవన్మరణానికి పాల్పడింది. సూరారం ప్రాంతానికి చెందిన దివంగత నీలం సతీశ్ కుమార్తె వైష్ణవి(11) దుండిగల్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్‌లో ఆరవ తరగతి చదువుతూ అక్కడే ఉంటోంది. వదిన పెళ్లి ఉండటంతో ఈ నెల 3న ఇంటికి వెళ్లిన వైష్ణవి అక్కడ బంధువులతో సంతోషంగా గడిపింది. 8న తిరిగి ఫౌండేషన్‌కు వచ్చింది. ఉదయం తోటి స్నేహితులతో కలిసి ఆనందంగా ఆటలు ఆడింది. అదే రోజు మధ్యాహ్నం తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వైష్ణవి ఉరి వేసుకున్న గదిలోనే గతేడాది మరో బాలిక ఇదే విధంగా ఆత్మహత్యకు పాల్పడటంపై మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి వచ్చినప్పుడు సంతోషంగా ఉందని, 8వ తేదీ మధ్యాహ్నం వరకు స్నేహితులతో ఆటలు ఆడిందని, ఇంతలోనే ఆత్మహత్య చేసుకోవడం వెనుక తమకు అనుమానాలు ఉన్నాయని అంటున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

'టెట్' దరఖాస్తు గడువు పెంపు!

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులొచ్చాయి. ఈ మధ్య కాలంలో బీఈడీ చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అయినప్పటికీ పదోన్నతుల కోసం సర్వీస్ టీచర్లు కూడా టెట్ రాయాలన్న నిబంధన ఉండటంతో ఈసారి 3 లక్షల అప్లికేషన్లు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

ఎన్‌సీటీఈ నుంచి సమాధానం వస్తేనే స్పష్టత..: 80 వేల మంది టీచర్లు టెట్ అర్హత కోసం దరఖాస్తు చేయాల్సి ఉండగా వారు ముందుకు రాలేదు. సెకండరీ గ్రేడ్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్‌కు టెట్ అవసరం. కానీ ఎస్జీటీగా ఉన్న వ్యక్తి ప్రాథమిక స్కూల్ హెచ్‌ఎంగా వెళితే, అది సమాన హోదాగా టీచర్లు చెబుతున్నారు. మరోవైపు స్కూల్ అసిస్టెంట్లు ప్రాథమిక, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వెళ్లినా హోదాలో మార్పు ఉండదనే వాదన టీచర్లు లేవనెత్తారు. అలాంటప్పుడు టెట్‌తో అవసరం ఏమిటనే దానిపై ఉపాధ్యాయ సంఘాలు స్పష్టత కోరాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్య అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ)కి లేఖ రాశారు. ఒకటి రెండు రోజుల్లో దీనికి సమాధానం వస్తుందని ఆశిస్తున్నారు.

పరీక్ష తేదీల్లో మార్పులు ఉండవు..: కేవలం దరఖాస్తు చేసుకోవడానికి, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుకు మాత్రమే గడువు పెంచే ఆలోచనలో ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అంతే తప్ప పరీక్ష తేదీల్లో మార్పు ఉండదని స్పష్టం చేస్తున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం టెట్ పరీక్ష మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకూ జరుగుతుంది. ఫలితాలను జూన్ 12న వెల్లడిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారు డీఎస్సీ రాసేందుకు వీలుగా ఆ పరీక్ష గడువునూ పెంచారు.

డీఎస్సీకి అంతే.. పెద్దగా దరఖాస్తుల్లేవ్ ..: డీఎస్సీ జూలై 17 నుంచి 31వ తేదీ వరకూ జరుగుతుంది. అయితే డీఎస్సీకి కూడా ఇప్పటి వరకూ పెద్దగా దరఖాస్తులు రాలేదు. పోస్టులు పెరిగినా కొత్తగా వచ్చిన దరఖాస్తులు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి సర్కారు డీఎస్సీని ప్రకటించింది. దీనికి కొత్తగా వచ్చిన దరఖాస్తులు 37,700. గతేడాది 5,089 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ కోసం 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు మళ్ళీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.

గడువు పెంచాల్సిందే

టెట్ అప్లికేషన్స్ గడువు పెంచి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి. ఉగాది, రంజాన్ సెలవుల కారణంగా రాష్ట్రంలో మీ సేవ సెంటర్లు అందుబాటులో ఉండటం లేదు. మొబైల్‌లో టెట్ దరఖాస్తులు పూర్తి చేయడం ఇబ్బందిగా ఉంది.

– రావుల మనోహర్ రెడ్డి (డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

జూన్ వరకు నీటి సమస్య రాదు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులను నియమించిన విషయాన్ని గుర్తు చేసింది.

ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందన..: తాగునీటి సమస్య ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చినా, వార్తలు వచ్చినా వెంటనే అధికార యంత్రాంగం స్పందిస్తోందని ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 143 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఉంటే.. అందులో 130 మునిసిపాలిటీల్లో సాధారణ రోజులతో పోలిస్తే పదిశాతం మేరకు నీటి కొరత ఉన్నా.. ప్రజలకు సరిపడే తాగునీటి సరఫరా జరుగుతోందని వివరించింది. సాధారణ రోజుల్లో ఈ పట్టణాల్లో సగటున 1398.05 ఎల్ఎండీ(మిలియన్స్‌లీటర్స్ పర్ డే) తాటి సరఫరా జరిగితే ప్రస్తుతం 1371 ఎల్ఎండీల నీటి సరఫరా జరుగుతోందని, 26.31 ఎల్ఎండీల కొరత ఏర్పడిందని స్పష్టం చేసింది. పది మునిసిపాలిటీలతోపాటు, రెండు కార్పొరేషన్లలో అధికంగా నీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఖమ్మం, కరీంనగర్‌లో ప్రత్యామ్నాయ చర్యలు..: ఖమ్మం, కరీంనగర్‌లో ఎండలు ముదిరే కొద్ది నీటి ఎద్దడి పెరుగుతుందన్న అంచనాతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. 27 పట్టణాల్లో 135 ఎల్ పీసీడీ(లీటర్స్ పర్ పర్సన్ పర్‌డే) కంటే ఎక్కువ నీటి సరఫరా జరుగుతుంటే, 48 పట్టణాల్లో 100 నుంచి 135 ఎల్‌పీసీడీల మధ్య, 67 మునిసిపాలిటీల్లో 100 ఎల్‌పీసీడీ కంటే తక్కువ సరఫరా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో 23,839 ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, గ్రామాల్లో నీటి ఎద్దడి లేదని భగీరథ అధికారవర్గాలు చెబుతున్నాయి.

నీటి మట్టాలు తగ్గడం వల్లనే ఎద్దడి..: గడిచిన అక్టోబర్ నుంచి వర్షాలు లేకపోవడం, గోదావరి, కృష్ణా రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గడం వల్ల తాగునీటి సమస్య ఉత్పన్నం అయినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అందుబాటులో గ్రిడ్, స్టాండ్ బై పంపులు

మంచినీటి సమస్య ఎక్కడైనా తలెత్తితే గ్రిడ్ పంప్‌లతో పాటు, స్టాండ్‌బై పంపులు అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా స్థాయిలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు జిల్లా కలెక్టర్లకు మొత్తం రూ. 100 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపింది. నాగార్జునసాగర్ నుంచి పాలేరు, ఉదయ సముద్రం రిజర్వాయర్‌ల నుంచి నల్గొండ, ఖమ్మం పట్టణాలకు నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేట్టింది. మిడ్ మానేర్, లోయర్ మానేరు నుంచి కరీంనగర్ నగరానికి నీటిని అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. అవసరమైతే కర్ణాటకలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కొంత నీటిని విడుదల చేయాలంటూ అక్కడి ప్రభుత్వాన్ని కోరాలని ఇరిగేషన్ విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంది. నారాయణపూర్ నుంచి జూరాల రిజర్వాయర్‌కు వచ్చే నీటితో గద్వాల మిషన్ భగీరథకు తాగునీటి సరఫరా చేసుకోవచ్చని భావిస్తున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు 131 పట్టణాల్లో 294 ప్రభుత్వ ట్యాంకర్లతో పాటు 97 ట్యాంకర్లను అద్దెకు తీసుకుని, అత్యవసరమైతే ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

▶ మొదటి పేజీ తరువాయి

కవితను బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాలు తారుమారయ్యే అవకాశం ఉందన్నారు. చార్జిషీటులో కవిత పాత్రపై స్పష్టత ఇవ్వడానికి మరో 14 రోజుల గడువు కావాలని కోరారు. అయితే కస్టడీ పొడిగింపు ద్వారా ఈడీ తెలుసుకోవాల్సిన విషయాలేవీ లేవని కవిత తరపు న్యాయవాది నితీష్ రాణా వాదించారు. ఈ కేసులో రెండేళ్లుగా దర్యాప్తు కొనసాగుతున్నా ఈడీ అధారాలేవీ చూపలేదన్నారు. కవితకు స్వయంగా మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. కానీ అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. నిందితులకు నేరుగా మాట్లాడే హక్కు ఉందని కవిత న్యాయవాది తెలపగా అందుకోసం దరఖాస్తు చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. వాదనల అనంతరం కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23 వరకు పొడిగిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కోర్టు అనుమతితో కవితను ఆమె భర్త, మామ కలిసి కాసేపు మాట్లాడారు.

1,012 అడుగుల మేర నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. మంగళవారం 1,012 అడుగుల మేర ఉంటుంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేసారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలిపారు.

లేగదూడపై చిరుత దాడి

బిజినేపల్లి: మండలంలోని వసురాంతండా గ్రామపంచాయతీ పరిధిలో అంగోతు రాముడుకు చెందిన లేగదూడపై చిరుత దాడి చేసింది. ఈ ఘటన సోమవారం రాత్రి వెలుగు చూసింది. ఎఫ్ఆర్ఓ పర్వేజ్ అహ్మద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల కిందట పశువుల మంద నుంచి లేగ దూడ మాయమైంది. రైతు రాములు ఆ దూడ కోసం వెతుకుతున్న క్రమంలో లేగ దూడను లాక్కెళ్లిన అచ్చులను గుర్తించారు. ఆ అచ్చుల ద్వారా వెళ్లగా అడవిలో పల్లెచింతల అనే ప్రాంతంలో లేగదూడ కళేబరం కనిపించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించి ఆ లేగదూడపై దాడి చేసింది చిరుతయేనని నిర్ధారించారు. అటవీ సమీప రైతులు, తండా వాసులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మల్దకల్: అక్రమంగా కర్ణాటకకు బొలెరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం మల్దకల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధరూర్‌కి చెందిన ఎరుకలి వెంకటేశ్వర్లు, ఎరుకలి రంగస్వామి మల్దకల్‌లో సోమవారం లబ్ధిదారుల నుంచి 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేశారు. వాటిని మంగళవారం రాత్రి బొలెరో వాహనంలో కర్ణాటకకు తరలిస్తుండగా.. పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

కలవరం వద్దు.. క్రోధితో కల్లోలం లేదు



పంచాంగ శ్రవణం చేస్తున్న బ్రహ్మశ్రీ ఆనంద్ శర్మ

- జోగుళాంబ ఆలయంలో "క్రోధి" పంచాంగ శ్రవణం

జోగుళాంబ శక్తిపీఠం: క్రోధి అనగానే భయపడాల్సిన అవసరం లేదని, కరతాల ధ్వనులతో వస్తున్నది క్రోధి కల్లోల పెట్టదు కలవరపడకు అంటూ జోగుళాంబ ఆలయంలో ఉగాది రోజు మంగళవారం సాయంత్రం బ్రహ్మశ్రీ ఆనంద్ శర్మ పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. క్రోధః అస్య స్థితి క్రోధి అంటే కోపాన్ని కలిగించునది క్రోధి అని అర్థం వస్తుందన్నారు. ఇది కోప స్వభావం గల సంవత్సరమని చెప్పుకొచ్చారు. కాలస్వరూపం ప్రకృతిలో క్రోధంగా ఉంటుందన్నారు. 60 ఏళ్ల కాల చక్రములో 38వ సంవత్సరం పేరే క్రోధి అన్నారు. తెలుగు 60 సంవత్సరాల పేర్లలో 13 పేర్లు లోప భూయిష్టమైన సంవత్సరాలే ఉంటాయన్నారు. అదే విధంగా 59వ సంవత్సరం పేరు కూడా 'క్రోధన' ఉంటుందని ఈ రెండు ఒకే స్వభావాలు కలిగి ఉంటాయన్నారు. దుష్ట శిక్షణార్థమై అసుర (రాక్షస) బుద్ధిని తొలగించడానికి భగవంతుడు కాలసస్వరూపంలో క్రోధాన్ని వహిస్తుంటారని, చెడు ఎక్కడైతే ఉంటుందో తగ్గించడానికి అవసరమైనటువంటి క్రోధాన్ని తీసుకుని భగవంతుడు దుష్ట శిక్షణ చేస్తారంటూ క్రోధి నామ సంవత్సరంపై అందరిలో నెలకొన్న భయాన్ని తొలగించే ప్రయత్నం చేశారు.

వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై..

ఈ ఏడాది రాజు కుజుడు కావడం చేత అగ్ని ప్రమాదాలు, చోరీలు, వాహన ప్రమాదాలు ఉండే అవకాశమున్నప్పటికీ పోలీస్ యంత్రాంగం సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. అదేవిధంగా అగ్నిమాపక, పోలీస్ యంత్రాంగానికి పని భారం పెరుగుతుందన్నారు. శనికి నాలుగు ఆధిపత్యాలు కలిసి రావడంతో మోసాలు కూడా అధికంగా జరుగుతాయన్నారు. వాతావరణ మార్పులతో కొత్త వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ వైద్య ఆరోగ్య శాఖ ఎంతో సమర్థవంతమైన సేవలు అందిస్తుందన్నారు. సస్యాధిపతి కుజుడు కావడం చేత జిల్లాలో పంటలకు తగ్గట్టు ఆశాజనకమైన వర్షాలు ఉంటాయన్నారు. ఎర్ర భూమి పంటలు బాగా పండుతాయన్నారు. భూమికి కుజుడు పుత్రుడు కావడంతో భూముల విలువలు పెరిగి తద్వారా ప్రభుత్వానికి రెవెన్యూ ఆదాయం పెరుగుతుందని, అలాగే రియల్ ఎస్టేట్ రంగం బాగా పుంజుకుంటుందన్నారు. అదే విధంగా భూములను అడ్డం పెట్టుకుని మోసం చేసే వారి సంఖ్య కూడా పెరుగుతుందని, భూముల క్రయ విక్రయాలలో జాగ్రత్తగా ఉండాలని సూచన చేశారు. మంత్రి, సేనాధిపతి అర్ఘ్యాధిపతి, వేఘాధిపతి నాలుగు ఆధిపత్యాలు శనికి కలిసి రావడంతో న్యాయశాఖ మరింత సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. న్యాయపరమైన విషయాలలో కోర్టు తీర్పులు కఠినంగా ఉంటాయని, గతంలో కంటే ఈ ఏడాది చాలా పెండింగ్ కేసులకు మోక్షం లభించే అవకాశం ఉంటుందన్నారు.

■ రక్షణ శాఖ సమాజంలో కీలక పాత్ర వహిస్తుందని, శాస్త్ర, సాంకేతిక, పరిజ్ఞాన పరిశోధన విషయంలో భాగంగా ఖగోళ పరిశోధనలు అత్యున్నత స్థాయిలో పెరిగి దేశ ఖ్యాతి విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. జగల్లగ్న, వర్ష లగ్నాలు రెండూ ధనుర్లగ్నాలు కావడంతో పుణ్య, దైవ కార్యక్రమాలు పెరిగి ఆలయాలపై ప్రజలకు ఆసక్తి పెరుగుతుందన్నారు. పంచగ్రహ కూటమి కారణంగా ఆధ్యాత్మిక వేత్తలకు కొంత కీడు, అపకీర్తి వచ్చే అవకాశం ఉందని అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రాలలో వివాదాలు సంభవించవచ్చన్నారు. ధాన్యాధిపతి చంద్రుడు కావడం చేత పంటలు సమృద్ధిగా ఉంటాయని, అలాగే వివిధ శాఖల అధికారుల మధ్య మనస్పర్థలతో పోటీతత్వం పెరుగుతుందన్నారు. శని ఆధిపత్యం కారణంగా ప్రభుత్వ అధికారులకు మరింత పట్టు పెరుగుతుందన్నారు.

సుపరిపాలనకై అధికారుల కఠిన నిర్ణయాలు

సుస్థిరమైన పరిపాలన అందించే దిశగా పాలన అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ప్రజారంజకమై పరిపాలన అందించేందుకు జిల్లా సర్వోన్నత అధికారి తీసుకునే నిర్ణయాల ప్రభావం తప్పు చేసిన వారి పైనే కాకుండా మంచివారిపై కూడా కొంత ప్రభావం పడుతుందన్నారు. తద్వారా జిల్లాలోని వివిధ శాఖలన్నీ సమన్వయంగా పని చేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తాయన్నారు. జిల్లా పరిపాలన అధికారి దక్షతతో సమయానుకూలంగా సానుకూల నిర్ణయాలతో ప్రజలకు మేలు కలుగుతుందని, ఉమ్మడి పాలమూరు జిల్లా రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు.

■ క్రోధి నామసంవత్సరంలో సాయన, నిరయణ ఆర్ద్రా ప్రవేశ లగ్నం ప్రకారం శుక్రుడు యొక్క ప్రభావం చేత మీడియా రంగం కొత్త పుంతలు తొక్కుతుందని, వార్తల కోసం వెతుకులాట తప్పదన్నారు. అనేక కుంభకోణాలను బయట పెడుతుందన్నారు. ప్రింట్ మీడియాపై ప్రజలకు మళ్లీ ఆసక్తి పెరుగుతుందన్నారు. ఇక సామాజిక మాధ్యమాలలో అనేక గాలి వార్తలకు కేంద్ర బిందువు అవుతాయని, అబద్ధపు వార్తలు అధికమవుతాయన్నారు. చేనేత కార్మికులకు గతంలో పోలిస్తే ఈ ఏడాది మంచి గుర్తింపు, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉంటాయన్నారు. భూమిని ఆధారం చేసుకుని ఉన్న కార్మిక వర్గానికి ఈ ఏడాది కొంత శ్రమ తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. పర్యాటక శాఖ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు.

■ గురువు రసాధిపతి, అలాగే శని సేనాధిపతి కావడం వల్ల రాజకీయరంగంలో ఎవరికి వారు తమ శక్తియుక్తులతో పట్టు బిగించడం కోసం చేసే ప్రయత్నాలు ఎలా ఉన్నా ఊహించని విధంగా ఫలితాలు ఉండబోతాయన్నారు. ఈ ఏడాది నర్మదా నదికి పుష్కరాలు వస్తాయన్నారు. దేశంలో ఈ ఏడాది గ్రహణాలు ఏవీ లేకపోవడం కొంత శ్రేయదాయకమన్నారు. గురు, శుక్ర మౌఢ్యాలతో ఈ ఏడాది శుభకార్యాలకు ముహూర్తాలు తక్కువగా ఉంటాయన్నారు. పంచాంగ శ్రవణ అనంతరం ఆనంద్ శర్మతో పాటుగా ఆలయ అర్చకులకు ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్య సత్కారం చేశారు.

ఉగాది కవి సమ్మేళనంలో జిల్లా కవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కవి సమ్మేళనంలో నిర్వహించారు. కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన కవులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. కోట్ల వెంకటేశ్వరరెడ్డి ఉగాది ఒక భావగీతం, భీంపల్లి శ్రీకాంత్ నాందీవాచకం అనే కవితలను చదివారు. అనంతరం తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ కవులను శాలువా, నగదుతో సత్కరించారు. కార్యక్రమంలో కేంద్రసాహిత్య అకాడమీ గ్రహీతలు డాక్టర్ ఎస్.గోపి, గోరటి వెంకన్న, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



కవితను వినిపిస్తున్న డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్

మన్యంకొండలో వైభవంగా సంబరాలు



లక్ష్మీవేంకటేశ్వరస్వామికి పూజలు చేసి పంచాంగ శ్రవణం చేస్తున్న ధర్మకర్తలు

- స్వర్ణాభరణ అలంకరణలో వేంకటేశ్వరస్వామి దర్శనం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి నూతన వస్త్రధారణ చేసి బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారిని పల్లకిలో గర్భగుడి నుంచి హనుమద్దాసుల మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం పూజలు చేసి హారతి ఇచ్చారు. పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు పూజలు చేసి తరించారు.

స్వామివారి పల్లకీ సేవ

ఉగాది సందర్భంగా దేవస్థానంలో స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. అలంకరించిన పల్లకిలో స్వామివారిని గర్భగుడి నుంచి గుండం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గుండం వద్ద ఆరగింపు తదితర పూజలు చేశారు. తిరిగి మళ్లీ పల్లకిలో స్వామివారిని ఊరేగింపుగా గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కురుమూర్తిస్వామిని దర్శించుకున్న ప్రముఖులు



పంచాంగ శ్రవణంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జీఎంఆర్ తదితరులు

చిన్నచింతకుంట: ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం చిన్నచింతకుంట మండలం అమ్మాపురం సమీపంలో ఉన్న కురుమూర్తిస్వామి ఆలయాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దంపతులు, కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి దర్శించుకున్నారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం శాలువాలతో సత్కరించారు. అలాగే ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రావణంలో పాల్గొన్నారు. వారి వెంట పార్టీ రాష్ట్ర నాయకుడు అరవింద్‌కుమార్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు మహమూద్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, అప్పంపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, జీజీ పాల్, కతలన్న తదితరులు ఉన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

నర్వ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం అంతర్రాష్ట్ర స్థాయి వృషభరాజుల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. బంగ్లా బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 20 జతల ఎద్దులు పాల్గొన్నాయి. నాలుగు పళ్ల విభాగం పోటీలను మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ప్రారంభించారు. బండను లాగుతున్న వృషభరాజులను అదలిస్తూ, రైతులను ఉత్సాహపరిచారు. అనంతరం బహుమతులను ప్రదానం చేశారు.

విజేతలు వీరే..

అంతర్రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో ఏపీలోని పురిటిపల్లికి చెందిన బచ్చల భాస్కర్‌రెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలవగా.. ద్వితీయ స్థానంలో నంద్యాల జిల్లా కొత్తకోట గురునాథ్, తృతీయ స్థానంలో తిరుతపయ్య, నాల్గో స్థానంలో జోగుళాంబ గద్వాల జిల్లా మద్దెలబండ పాగుంటన్న, ఐదో స్థానంలో సాతర్ల ఎస్ఎస్‌కే బుల్స్ వృషభాలు నిలిచాయి. కార్యక్రమంలో బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, చెన్నయ్యసాగర్, బాల్‌రాంగౌడ్, కృష్ణారెడ్డి, శరణప్ప, శ్రీనివాస్‌రెడ్డి, నీరజ్, అజిత్‌సింహారెడ్డి, ఆంజనేయరెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.